


ధర్మారంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కాలువలో నిలిచిన మురుగు నీరు

కమాన్‌పూర్ మండలం ఇస్లాంనగర్‌లో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తచెదారం

# అధ్వానంగా పారిశుధ్యం

గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన అస్తవ్యస్తంగా మారింది. గ్రామాలను సందర్శించకపోవడంతో పారిశుధ్య నిర్వహణ పడకేసింది. మురికి కాలువలను శుభ్రం చేయించకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ చేయక పోవడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. వీధి దీపాలు కూడా వెలగడం లేదు. మిషన్ భగీరథ పథకం ద్వారా నీళ్లు అందడం లేదు. మంగళవారం ఆంధ్రజ్యోతి విజిట్‌లో ప్రజలు పలు సమస్యలను ప్రస్తావించారు.

- యేడాదిగా ప్రత్యేకాధికారుల పాలన
- నీటి సరఫరా పట్టించుకోరు, లైట్లు వేయరు
- దోమల నివారణకు చర్యలు లేవు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- పలు గ్రామాల్లో ఆంధ్రజ్యోతి విజిట్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం ముగిసి ఏడాది గడిచినా కూడా ప్రభుత్వం ఇప్పటి వరకు ఎన్నికలు నిర్వహించలేదు. ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నది. జిల్లాలో 263 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు ఏడాది కాలంగా నిలిచి పోయాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఎస్ఎఫ్‌సీ నిధులు అంతంత మాత్రంగానే వస్తున్నాయి. అవి సిబ్బంది



పెద్దపల్లి మండలం కొత్తపల్లి లో మురికికాలువలో పేరుకుపోయిన చెత్త చెదారం

వేతనాలు, పంచాయతీల నిర్వహణకే సరిపోతున్నాయి. ఎన్నికలు నిర్వహించనిదే 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కావని చెబుతున్నారు.

**● ఎక్కడి చెత్త అక్కడే... పైపులైన్ లీకేజీలు**

తడి, పొడి చెత్త నిర్వహణ సరిగా లేదు. ప్రతి గ్రామానికి ఒక ట్రాక్టర్ ఉండగా, ఆ ట్రాక్టర్‌లో డీజిల్ పోసేందుకు నిధులు లేక ఎక్కడి చెత్త అక్కడనే ఉంటున్నది. మిషన్ భగీరథ పథకం ద్వారా పలు గ్రామాలకు నీటి సరఫరా సక్రమంగా జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పైపు లైన్ల లీకేజీలను అరికట్టక పోవడంతో నీరంతా వృథాగా పోతున్నది. కొన్ని గ్రామాలకు తాగు నీరు అందడం లేదు. వచ్చే నెల నుంచి వేసవి కాలం ఆరంభం కానున్న దృష్ట్యా పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టని కారణంగా ప్రజలకు ఇబ్బందులు తప్పేలా లేవు. గ్రామ కార్యదర్శులు ప్రభుత్వ పథకాల అమలు, సర్వేల్లో మునిగి తేలుతుండగా, ప్రత్యేక అధికారులు నామమాత్రంగా పని చేస్తున్నారు. పాలకవర్గాలు లేక పోవడంతో పంచాయతీలకు దిక్కు, మొక్కు లేకుండా పోతున్నది. గతంలో మాజీ సర్పంచులు చేసిన కొన్ని పనులకు బిల్లులు రావడం లేదు. గ్రామాల్లో హరితవనాల నిర్వహణ సక్రమంగా లేదు. చెట్లు, మొక్కలుఎండి పోతున్నాయి. తెలంగాణ క్రీడా ప్రాంగణాలు వెల వెలబోతున్నాయి. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయా, గ్రామాల్లో సమస్యలు ఎప్పుడు పరిష్కారం అవుతాయా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా పలు గ్రామాలను 'ఆంధ్రజ్యోతి' బృందం విజిట్ చేసింది.



కన్నాలలో చెత్త చెదారంతో నిండిన మురికి కాలువ

మండలాల వారీగా 8వ పేజీలో...

## న్యూస్ బాక్స్

### పత్తి క్వింటాల్‌కు రూ.7021

పెద్దపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం క్వింటాల్ పత్తికి అత్యధికంగా రూ.7,021 ధర పలికింది. మోడల్ ధర రూ.6,421 ఉండగాఅత్యల్పంగా రూ.5,311 పలికింది. మార్కెట్‌కు 655.60 క్వింటాళ్ల పత్తి వచ్చింది. పత్తికి మద్దతు ధర లభించక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సీసీఐ కూడా పత్తికి మద్దతు ధర చెల్లించడం లేదని రైతులు వాపోతున్నారు.

### రెండు ఎకరాల వరకు రైతుభరోసా డబ్బులు జమ

పెద్దపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా పథకంలో భాగంగా 2 ఎకరాల భూములు గల రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం డబ్బులను ప్రభుత్వం జమ చేస్తోంది. మంగళవారం వరకు 86,550 మంది రైతులకు రూ.50 కోట్ల 33 లక్షల 95వేల571 రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. జిల్లాలో 1,61,032 మంది రైతులకు 159 కోట్ల 22 లక్షల 86 వేల 647 రూపాయలు ఇవ్వాల్సి ఉండగా, ట్రెజరీలో 1,28,735 మంది రైతుల పేరిట ప్రభుత్వం 115 కోట్ల 67 లక్షల 54 వేల 408 రూపాయలు జమ అయ్యాయి. అక్కడి నుంచి బ్యాంకులకు క్రమంగా బదిలీ అవుతున్నాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డి తెలిపారు.

### పాలకుర్తిలో ఎరువుల దుకాణాల తనిఖీలు



కుక్కలగూడూర్‌లో నిల్వలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి

పాలకుర్తి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని పలు గ్రామాల్లో ఎరువుల దుకాణాలను మంగళవారం మండల వ్యవసాయ శాఖ అధికారి బండి ప్రమోద్‌కుమార్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు సరిపడ యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కన్నాల, మేడిపెల్లి సంఘం ద్వారా రైతులకు ఎరువుల సరఫరా అవుతుందన్నారు. ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు, అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలతోపాటు డీలర్ లైసెన్సు రద్దు చేస్తామని తెలిపారు. మండలంలోని శ్రీరామ ట్రేడర్స్, వాసవి ఫెర్టిలైజర్ బసంత్‌నగర్, ఓం సాయి, శ్రీఆంజనేయ ఫెర్టిలైజర్స్ కుక్కలగూడూర్‌లో రికార్డులను పరిశీలించారు. రికార్డులో ఉన్న నిల్వ, సరుకులు సక్రమంగా ఉన్నాయా అని పరిశీలించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన డీలర్లను హెచ్చరించారు.

## గోదావరి తీరంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ దందా



- అనుమతి లేకుండా ఇసుక రీచ్‌లు
- అధికార పార్టీ నేత కనుసన్నల్లో దందా
- ట్రాక్టర్ ట్రిప్పునకు రూ.100 వసూలు

6

## ఎన్టీపీసీలో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలి



కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎంపీ వంశీకృష్ణ

పెద్దపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీలో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం పార్లమెంట్‌లో ఎంపీ మాట్లాడుతూ పెద్దపల్లి, రామగుండం ప్రాంతంలోని ఎన్టీపీసీ విస్తర ణలో విద్యుత్ ప్లాంట్లకు సంబంధించి స్థానికంగా నష్టా లను కలిగిస్తుందని అన్నారు. పెద్దపల్లి, రామగుండం ప్రాంతాల్లో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాల న్నారు, భూమి కోల్పోయిన వారికి ఆర్ఎన్ఆర్ ప్యాకేజీ కింద సహాయం అందించాలన్నారు. ఎన్టీపీసీ విస్తరణ కారణంగా రామగుండంలోని మాతంగి కాలనీ తీవ్రంగా నష్టపోతున్నదని, వారిని ఆదుకోవాలని ఎంపీ కేంద్రాన్ని కోరారు.

**నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలి**

పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కోరారు. మంగళవారం ఆయన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మన్ కుమార్‌తో కలిసి కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేశారు. జిల్లాలు ఏర్పాటై ఎనిమిదేళ్లు గడుస్తున్నాయని, జిల్లాకు ఒక నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, ఈ విద్యాలయాలు పేద, మధ్య తరగతి కుటుంబాలకు దోహదం చేయడంతో పాటు నాణ్యమైన విద్యను అందించనున్నాయని పేర్కొన్నారు. నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని ఎంపీ మంత్రిని కోరారు.

## విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

సుల్తానాబాద్ , ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కరించడంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే వినియోగదారుల ఫోరం దృష్టికి తీసుకురావాలని ఫోరం చైర్‌పర్సన్ రాజగోపాలచారి అన్నారు. కాట్నపల్లి సబ్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ పంపిణీలో ఎదురయ్యే సేవాలోపాలను సత్వరమే పరిష్కరించి వినియోగదారుల సమస్యల పరిష్కారానికి వేదికను ఏర్పాటు చేశామన్నారు.

కొదురుపాక గ్రామస్థుడు మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు, ఇండ్ల కనెక్షన్లకు కలిపి ఒకటే ట్రాన్స్‌ఫార్మర్ ఉందని, దాంతో మోటార్లు నడిచే సమయంలో ఇండ్లలో సరఫరాపై భారం పడి లోఓల్టేజీతో బల్బులు డిమ్‌గా వెలుగుతున్నాయని పేర్కొన్నారు. పదేళ్ళుగా లోఓల్టేజీ సమస్యతో సతమతమవుతున్నామని, అధికారులకు సమస్య చెబుతున్నా పరిష్కారం కావడం లేదని సుల్తానాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన వ్యక్తి ఫిర్యాదు చేశారు. భూపతిపూర్ చెందిన ఓ మహిళలకు ఇంటి మీటర్ ఇవ్వడంలో జరుగుతున్న జాప్యం గురించి ప్రస్తావించారు. అలాగే ఐతరాజుపల్లి, కాట్నపల్లి గ్రామానికి చెందిన పలువురు సమస్యలు ప్రస్తావించగా స్పందించిన చైర్‌పర్సన్ వెంటనే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఓవర్ లోడ్ సమస్యకు ప్రాధాన్యం ఇవ్వాలని, సమస్యలు లేకుండా చూడాలని, సర్వీసులను క్రమబద్ధీకరించాలని, అవసరమైన చోట స్తంభాలు వేసి కొత్త మీటర్లు ఇవ్వాలన్నారు. ఫోరం మెంబర్లు రమేష్, చరణ్‌దాస్, రామారావు, జిల్లా ఎస్ఈ మాధవరావు, పెద్దపల్లి డీఈ తిరుపతి, ఏడీఈతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు

కాట్నపల్లిలో నిర్వహించే విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక గురించి తమకు సమాచారం ఇవ్వలేదని పలు గ్రామాలకు చెందిన వారు ఆవేదన వ్యక్తం చేశారు.



వినియోగదారుల వేదికలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజగోపాలచారి

## గోదావరిఖనిలో ఊపందుకున్న రోడ్ల విస్తరణ



భవనాల తొలగింపు వ్యర్థాలతో నిండిపోయిన లక్ష్మీనగర్ రోడ్డు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గోదావరిఖనిలో చేపట్టిన రోడ్ల విస్తరణ పనులు ఊపందుకున్నాయి. లక్ష్మీనగర్ అజయ్ మెడికల్ స్టోర్ నుంచి పాపులర్ షూమార్ట్ వరకు, బట్టలబజార్‌లో రోడ్ల విస్తరణ జరుగుతుంది. కార్పొరేషన్ సిబ్బంది మార్కింగ్ ప్రకారం తొలగించాలంటూ ఆదేశాలు జారీ చేయడంతో భవనాల యజమానులు స్వచ్ఛందంగా తొలగింపు చేపట్టారు. బజార్‌లోని షాపులన్నీ ఒకే సారి మూసివేసి తొలగింపులు చేపడుతున్నారు. వ్యాపారులు దుకాణాల్లోని స్టాక్‌ను ఇతర ప్రాంతాలకు తరలిం చారు. ఎవరి భవనం వారు మార్కింగ్ ప్రకారం డ్రిల్ మిషన్లతో తొలగింపు చేప ట్టారు. తొలగింపులకు ముందుకు రాని వ్యాపారుల భవనాలకు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం యంత్రాలతో కూల్చి వేస్తున్నారు. కొందరు వ్యాపారులు రోడ్ల విస్తరణ తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే అభివృద్ధి పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. రోడ్ల విస్తరణకు భవనాల్లో మార్కింగ్ ప్రకారం తొలగిస్తుండడంతో ఆ ప్రాంత భవనాల వ్యర్థాలతో నిండిపోయింది. బట్టల బజార్ మూతపడినట్లయ్యింది. ఈ పరిస్థితి మరో 15రోజుల పాటు కొనసాగే అవకాశం ఉంది.

## ఏటీసీ సెంటర్‌ను త్వరగా పూర్తిచేయాలి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి ఐటీఐ ప్రాంగణంలో జరుగుతున్న ఏటీసీ భవన నిర్మాణ పనులను నెలాఖరులోగా పూర్తిచేయాలని లేబర్, ఎంప్లాయిమెంట్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్‌కుమార్ అన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంగళవారం నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ ఆరు ట్రేడ్‌లతో యువతకు ఉపాధి, శిక్షణ అందించేందుకు నిర్మాణం పూర్తయిన తర్వాత పరికరాలను అమర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భవన నిర్మాణ పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. పెద్దపల్లి ఐటీఐ కేంద్రం విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. ఐటీఐ సెంటర్‌కు ఉన్న విద్యుత్ బకాయిలను రూ.15లక్షల 80వేలను త్వరలో మంజూరు చేస్తామన్నారు. ఐటీఐ సెంటర్ ప్రహరీ మరమ్మతుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ఏటీసీ సెంటర్ ప్రాంగణంలో కలెక్టర్‌తో కలిసి ప్రిన్సిపల్ సెక్రటరీ మొక్కలు నాటారు. ఐటీఐ ప్రిన్సిపల్ బుచ్చిరెడ్డి వెంకటరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

### విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా చర్యలు

**● ఎస్ఈ మాధవరావు**

పెద్దపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వేసవి విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ముందస్తు కార్యాచరణ చర్యలు చేపట్టామని సూపరింటెండెంట్ ఇంజనీర్ కె మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈ నెలలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 280.58 మెగావాట్లు ఉందని, 10వ తేదీన 5.02 మిలియన్ యూనిట్లు నమోదైందని పేర్కొన్నారు. రానున్న మూడు నెలల విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అందులో భాగంగా 27 నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, 65 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుతున్నామని, 92 ట్రాన్స్‌ఫార్మర్లు అదనంగా పెడుతున్నామని ఎస్ఈ తెలిపారు. సబ్‌స్టేషన్లలో 2 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుతామని, 4 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను అదనంగా పెడుతున్నామని వివరించారు. ఒక లైన్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయినా ప్రత్యామ్నాయ లైను (ఇంటర్ లింకు లైన్) ద్వారా విద్యుత్ సరఫరా చేసేందుకు కొత్తగా 15 ఇంటర్ లింకింగ్ లైన్లను ఏర్పాటుకు ప్రణాళిక చేపట్టామన్నారు. నెలాఖరులోగా మిగతా పనులను పూర్తి చేస్తామని వివరించారు.

### సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యమైన బోధన



కన్నాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీఈవో మాధవి

పాలకుర్తి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కన్నాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆంగ్లం ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఈవో మాధవి మాట్లాడుతూ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యమైన బోధన అందించాలన్నారు. లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ సాయంతో పాఠ్యాంశాలను ఎలా బోధించాలో అవగాహన పెంచుకొని విద్యా ర్థుల్లో ఆంగ్లం భాషాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఎంఈవో విమల, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

**ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి):** విద్యార్థులకు అనువైన విధంగా బోధన చేయాలని ఎంఈవో నరేంద్రచారి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం గండ్ర దేవేందర్‌రావులు అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జూలపల్లి, ధర్మారం, సుల్తానాబాద్, ఎలిగేడులకు చెందిన తెలుగు భాషా ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. తెలుగు భాష ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ ఐఎఫ్‌పి ప్యానల్ బోర్డ్ వినియోగంపై రిసోర్స్ పర్సన్స్ శిక్షణ ఇచ్చారు.

### కమిషనర్‌ను కలిసిన మాజీ చైర్‌పర్సన్

సుల్తానాబాద్, ఫిబ్రవరి 11: (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్‌ను మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు మంగళవారం కలిసారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు.

## వరకట్న వేధింపుల కేసులో ఆరు నెలల జైలు

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వరకట్నం వేధింపుల కేసులో ఒకరికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ. 1,000 జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ మెజిస్ట్రేట్ శ్రీనిజ మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపెల్లి గ్రామానికి చెందిన నల్లాల విక్రమ్‌కు 11 ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన శ్రీలేఖతో వివాహం జరిగింది. కొన్ని సంవత్సరాల తర్వాత అదనంగా వరకట్నం తేవాలంటూ విక్రమ్ తన భార్య శ్రీలేఖను తరచుగా వేధించాడు. పెద్ద మనుషుల సమక్షంలో పలు పంచాయితీలు జరిగాయి. అయినప్పటికీ విక్రమ్ భార్యను వేధించడంతో పాటు 2019 మార్చి 17న దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై సతీష్ కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ పోలీసులు సరైన సాక్షులను జగిత్యాల కోర్టులో మంగళవారం ప్రవేశపెట్టారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేష్ తమ వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

## ఇసుక రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అనుమతి ఒక వాహనానికి తీసుకుని మరో ట్రాలీతో ఇసుకను రవాణా చేస్తున్న ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఓనర్ కంకణాల సుధాకర్, డ్రైవర్ సూర నరసింహులుపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ మంగళవారం తెలిపారు. అతివేగం, అజాగ్రత్తగా ఇసుకను తరలిస్తున్న క్రమంలో తనిఖీ చేయగా ఒక ట్రాక్టర్ నంబర్‌పై అనుమతి పొంది మరో ట్రాలీతో రవాణా చేయడాన్ని గుర్తించామని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుకను తరలించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని ఎస్‌ఐ రమాకాంత్ హెచ్చరించారు.

## ఇద్దరి అరెస్టు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న ఇద్దరిని మంగళవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. పొత్తూరు సమీపంలోని బిక్కవాగు నుంచి ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడిచేసి ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. కందికట్కూర్ గ్రామానికి చెందిన రంగు రజనీకాంత్, మామిండ్ల పర్శరాంలను అరెస్టు చేసి, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శంకరపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు కేశవపట్నం ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు. మానకొండూర్ మండలం వెల్ది గ్రామం నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కాచాపూర్ శివారులో పట్టుకున్నారు.

## చెట్టు పైనుంచి పడి యువకుడి మృతి

చిగురుమామిడి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన చెంచల సంపత్(35) అనే యువ రైతు మంగళవారం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన ప్రకారం.. రోజు వారి కార్యక్రమంలో భాగంగా మంగళవారం వ్యవసాయ పనులకు వెళ్లిన సంపత్ చింతచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడి బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

## రూ.7,100 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,100 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 26మంది రైతులు 225క్వింటాళ్ల విడి పత్తి, 10మంది రైతులు 16క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకువచ్చారు.ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,100, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.


చెరువు నుంచి కొట్టుకొచ్చిన రాళ్లు

## చెరువు కట్ట మరమ్మతుకు మోక్షమెప్పుడో..?

● రెండున్నరేళ్లుగా రైతుల ఇక్కట్లు ● పట్టించుకోని అధికారులు

కొడిమ్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని పోతు చెరువు కట్ట మరమ్మతుకు మోక్షమెప్పుడు కలుగుతుందోనని గంగారాంతండా, సూరంపేట గ్రామాల రైతులు ఎదురు చూస్తున్నారు. రెండున్నరేళ్ల క్రితం వర్షాల కారణంగా పోతు చెరువు కట్ట నీటి ప్రవాహానికి తెగింది. దీంతో కట్ట కింద ఉన్న పొలాలలో ఇసుక మేటలు పెట్టాయి. పలువురు రైతుల పశువులు, మేకలు మృతి చెందాయి. బోరుబావులు, వ్యవసాయ బావులు, పైపులైన్లు, కరెంట్ స్థంబాలు, విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌పార్మర్లు నీట మునిగాయి. దీంతో సుమారు 250 మంది రైతులు లక్షలాది రూపాయలు నష్టపోయారు. పలు శాఖల అధికారులు వచ్చి ఆస్తి, పంట నష్టం సర్వే చేసినా పరిహారం అందలేదు. 20 మంది బాధితులకు రెడ్ క్రాస్ సంస్థ 2వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించింది. పోతు చెరువు కింద 500 ఎకరాల నుంచి 600 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇప్పటికీ చెరువు కట్ట మరమ్మతుకు నోచుకోక పోవడంతో రెండున్నరేళ్ళుగా కురుస్తున్న వర్షాలకు నీరు వృథాగా పోతోంది. పోతు చెరువు నీటితో నిండినట్ల యితే మండలంలోని కోనాపూర్, పోతారం, దమ్మయ్య పేట చెరువులే కాకుండా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గోవిం దారం, పసునూరు, చందుర్తిమల్యాల, రామన్న పేట, నర్సింగాపూర్ గ్రామాల చెరువులకు కూడా భూ గర్భ జలాలు వృద్ధి చెందుతాయని రైతులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పోతు చెరువు కట్టకు మరమ్మతు చేయించాలని రైతులు కోరుతున్నారు.



తెగిన పోతుచెరువు కట్ట, పొలాల్లో ఇసుక మేటలు

### మరమ్మతు చేయించాలి

**బోజ్యానాయక్, మాజీ సర్పంచ్ గంగారాంతండా**



పోతు చెరువుకట్టకు మరమ్మతు చేయించాలి. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలి. కట్ట తెగిపోవడంతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి.

### ప్రతిపాదనలు పంపాం

**రాజేష్‌ఖన్నా, నీటి పారుదల శాఖ ఏఈఈ**



మండలంలోని పోతు చెరువు కట్ట మరమ్మతుకు 3కోట్ల 78 లక్షల రూపాయల నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే చెరువు కట్ట మరమ్మతు పనులు ప్రారంభిస్తాం.

## ఎమ్మెల్యేను బెదిరించిన కేసులో నిందితుడి అరెస్టు

● బెంగుళూరులో అదుపులోకి తీసుకున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను వాట్సప్ కాల్ ద్వారా బెదిరించి, 20 లక్షలు డిమాండ్ చేసిన కేసులో హైదరాబాద్‌కు చెందిన యాస అఖిలేష్‌రెడ్డి(33)ని కొత్తపల్లి పోలీసులు సోమవారం బెంగుళూరులో అరెస్టు చేశారు. మంగళవారం అతడిని కరీంనగర్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కరీంనగర్ రూరల్ ఏఎస్పీ శుభం ప్రకాశ్ మీడియాకు వివరాలు తెలియజేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు గత సెప్టెంబరు 28న లండన్ నుంచి అఖిలేష్‌రెడ్డి వాట్సప్‌కాల్ చేసి తనకు రూ. 20 లక్షలు చెల్లించాలని, లేదంటే రాజకీయంగా అప్రతిష్టపాలు చేస్తానని, గౌరవానికి భంగం కలిగిస్తానని, ఎమ్మెల్యే ఇద్దరు పిల్లలను అనాథలయ్యేలా చేస్తానంటూ బెదిరించాడు. ఈ మేరకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు రంగారెడ్డి జిల్లా బోడుప్పల్‌లోని భవానీనగర్‌కు చెందిన యాస అఖిలేష్‌రెడ్డి అని, అతడు ప్రస్తుతం లండన్‌లో ఉన్నట్లు గుర్తించారు. అక్టోబరు నెలలో అప్పటి కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ లుక్ అవుట్ సర్క్యులర్‌ను జారీ చేశారు. నిందితుడు ఈ నెల 9న బెంగుళూరు విమానాశ్రయానికి వచ్చినట్లు గమనించిన బెంగుళూరులోని ఇమ్మిగ్రేషన్ అధికారులు వెంటనే అఖిలేష్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని కొత్తపల్లి ఎస్‌ఐకి సమాచారం అందించారు. కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి తన సిబ్బందితో బెంగుళూర్‌కు వెళ్లి నిందితుడిని సోమవారం అదుపులోకి తీసుకుని కరీంనగర్‌కు తీసుకువచ్చారు. మంగళవారం కోర్టులో హాజరుపరచి, మెజిస్ట్రేట్ ఆదేశాలతో కరీంనగర్ జైలులో రిమాండ్‌కు తరలించారు.

## వృద్ధుల ఆత్మహత్యలపై విచారణ జరిపించాలి

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వృద్ధులు ఎక్కడ ఆత్మహత్యలకు పాల్పడినా విచారణ జరిపించాలని తెలంగాణ సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్ మండలం మియాపూర్‌కు చెందిన గండి వీరేశం అనే వృద్ధుడు కోడలు, కొడుకు తిట్టి ఇంటిలో నుంచి వెళ్లగొట్టడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటలో కారకులపై చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖకు విజ్ఞప్తి చేశారు.

## భార్య, కొడుకుపై హత్యాయత్నం : నిందితుడి అరెస్టు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో భార్య, కొడుకుపై హత్యాయత్నం చేసిన ఘటన గోదావరిఖని జీఎం కాలనీలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ ఘటనలో నిందితుడు మడిపల్లి ఉదయ్(30)ని మంగళవారం అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగి ఉదయ్ 2022లో అనూష అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి 18నెలల బాబు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో ఉదయ్‌పై కేసు నమోదైంది. కుటుంబ వివాదాలతో భార్యాభర్తలు దూరంగా ఉంటున్నారు. భార్య అనూష గోదావరిఖని జీఎం కాలనీలోని పుట్టింట్లో ఉంటోంది. ఈ క్రమంలో ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఉదయ్ అత్తగారింటికి వెళ్లి భార్య, కుమారున్ని బైక్‌తో ఢీకొట్టి చంపేప్రయత్నం చేశాడు. చుట్టు పక్కల వారు అడ్డుకోవడంతో పారిపోయాడు. అనూష ఇచ్చిన ఫిర్యాదుతో ఉదయ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి మంగళవారం అరెస్టు చేశామని, బైక్ స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.



నిందితుడిని అరెస్టు చూపిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

## గోదావరి తీరంలో యథేచ్ఛగా ఇసుక దందా

● అనుమతి లేకుండా ఇసుక రీచ్‌లు ● అధికార పార్టీ నేత కనుసన్నల్లో రవాణా

జ్యోతినగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గోదావరి నది తీరంలో ఇసుక అక్రమ దందా నడుస్తోంది. రామగుండం మండలం మేడిపల్లి శివారు గోదావరి తీరంలోని ఇసుక రీచ్ నుంచి కొన్ని రోజులుగా ట్రాక్టర్లలో యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. మేడిపల్లి శివారులోని రీచ్ నుంచి ఇసుక తరలించేందుకు అనుమతి లేకున్నప్పటికీ అధికార పార్టీకి చెందిన నాయకుడి పలుకుబడితో ఇసుకను పెద్ద ఎత్తున తరలిస్తున్నారు. జిల్లాలో ఆరు ఇసుక రీచ్‌లకు మాత్రమే ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ ప్రాంతంలో అంతర్గాం మండలం గోలివాడ రీచ్‌కు మాత్రమే అనుమతి ఉంది. అయితే మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతి లేకుండానే మేడిపల్లి శివారు నుంచి ఇసుకను తరలిస్తున్నారు. నదిలో నీరు పుష్కలంగా ఉండడంతో ఇసుకను తరలించ లేదు. ప్రస్తుతం ఈ ప్రాంతంలోని గోదావరి నీరు లేకపోవడంతో ప్రభుత్వం ఇసుక రీచ్‌లకు అనుమతి నిచ్చి ఉచితంగా సరఫరా స్కీంను అమలు చేస్తున్నది. ఇది కూడా కేవలం సొంత ఇంటి నిర్మాణాలకు మాత్ర మే ఇసుకను సరఫరా చేసే అవకాశముంది. అంతర్గాం గోలివాడ రీచ్ నుంచి మాత్రమే ఇసుకను రవాణా చేయాల్సి ఉంది. మేడిపల్లి నుంచి అక్రమంగా రోజుకు రెండు, మూడు వందల ట్రిప్పుల ఇసుకను తరలిస్తున్నారు.


మేడిపల్లి గోదావరి రీచ్ నుంచి ఇసుక తవ్వకాలు

### ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పు రూ. 100 వసూలు

ఇసుక దందా నడిపిస్తున్న అధికార పార్టీకి చెందిన నాయకుడు ఒక్క ట్రాక్టర్ ఇసుక ట్రిప్పు రూ.100 వసూలు చేస్తున్నారు. ఒక ట్రాక్టర్‌కు రూ.2వేల నంచి రూ.2,300 తీసుకుంటున్నారు. దీని కోసం ఇక్కడ ఒక వ్యక్తిని నియమించి నోట్‌బుక్‌లో ట్రిప్పుల లెక్కలు నమోదు చేస్తున్నారు. రోజుకు 200కుపైగా ట్రిప్పుల ఇసుకను తరలిస్తున్నట్లు రికార్డుల ద్వారా తెలుస్తున్నది. ఇక్కడ ఎన్టీపీసీకి చెందిన ట్రాక్టర్లకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. మల్కాపూర్ శివారులో మరో రీచ్‌ను అధికార పార్టీకి చెందిన నాయకుడి కనుసన్నల్లో నడుస్తున్నది.


ఇసుక ట్రిప్పులను నమోదు చేస్తున్న వ్యక్తి

అక్కడ గోదావరిఖనిట్రాక్టర్లకు మాత్రమే అనుమతినిచ్చి ట్రిప్పు రూ.100 వసూలు చేస్తున్నట్లు తెలుస్తున్నది.

### ఇంటి నిర్మాణాలకు మాత్రమే ఇసుక

**కుమారస్వామి, రామగుండం తహసీల్దార్**

ఇంటి నిర్మాణాలకు మాత్రమే ఇసుకను అనుమతిచ్చామని రామగుండం తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. జిల్లాలో 6 రీచ్‌లకు మాత్రమే అనుమతి ఉందన్నారు. మేడిపల్లి శివారులో ఇసుక తరలింపు సమాచారం లేదన్నారు. ఉచిత ఇసుకకు సంబంధించి తహసీల్దార్లకే అధికారం ఇచ్చినట్లు జిల్లా మైనింగ్ అధికారి తెలిపారు.

## కాకతీయ కెనాల్‌లో ఒకరి గల్లంతు.. కాపాడబోయిన మరొకరి మృతి


సురేష్(ఫైల్)

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ సమీపంలో కాకతీయ కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. అతడిని కాపాడటానికి ప్రయత్నించిన అతని మిత్రుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన జూపాక శ్రీహరి(48), రేణిగుంట్ల సురేష్(30) అనే ఇద్దరు మంగళవారం గ్రామ శివారులోని కాకతీయ ఉప కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లారు. ముందుగా జూపాక శ్రీహరి కాకతీయ కాలువలోకి దిగగా నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో అందులో కొట్టుకపోయాడు. గమనించిన సురేష్ కాపాడేందుకు కాలువలోకి దిగాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో సురేష్ సైతం కొట్టుకొని పోయాడు. గమనించిన గ్రామస్థులు వెంటనే పోలీసులు సమాచారం అందించారు. కొంతమంది యువకులు సురేష్ మృతదేహాన్ని బయటికి తీశారు. శ్రీహరి ఆచూకీ లభ్యం కాలేదు. చీకటి పడటంతో గాలింపు చర్యలను నిలిపివేశారు. సంఘటన స్థలానికి హుజూరాబాద్ సీఐ తిరుమల్‌గౌడ్ చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

## గుండెపోటుతో గల్ఫ్‌లో మృతి

● స్వగ్రామానికి చేరిన మృతదేహం


వెంకటస్వామి(ఫైల్)

రామడుగు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన ఓ వ్యక్తి గుండె పోటుతో మృతి చెందగా.. మంగళవారం మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. మండలంలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన నీలం వెంకటస్వామి కొన్ని నెలల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. అయితే అక్కడ పనులు చేస్తుండగా ఈ నెల 6న గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమై ఆలయన మృతదేహం కోసం ఎదురు చూశారు. మృతదేహాన్ని ఎయిర్‌పోర్ట్ నుంచి స్వగ్రామానికి తీసుకరావడానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అంబులెన్స్ ఏర్పాటు చేశారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు కన్నీటి వీడ్కోలు పలికారు.

## బాలుడిని తప్పించబోయి ఆటో బోల్తా

● ఆరుగురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సైకిల్‌పై ఎదురుగా వస్తున్న బాలుడిని తప్పించే ప్రయత్నంలో ఆటో బోల్తాపడి పలువురికి గాయాలైన సంఘటన వేములవాడ మండలం సంకెపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శాభాష్‌పల్లి గ్రామానికి చెందిన 11మంది మహిళా సంఘ సభ్యులు బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామంలోని బ్యాంకుకు వెళుతున్నారు. సంకెపల్లి గ్రామంలోకి వెళ్లేలోపు ఎదురుగా సైకిల్‌పై వస్తున్న బాలుడిని తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణించే కట్కూరి కవితకు తీవ్రగాయాలై పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్‌కు చేయి, మహిళకు చేతివేళ్లు విరగగా, మరో మహిళ శ్వాసతో ఇబ్బంది పడటంతో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. మిగతా వారికి స్వల్ప గాయాలు కాగా వేములవాడ ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ పందుగ ప్రదీప్ ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. సంఘటనపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సమాచారం అందించడంతో మెరుగైన చికిత్స అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, జిల్లా వైద్యాధికారి రజిత, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్యలను ఆదేశించినట్లు తెలిపారు. జిల్లా వైద్యాధికారి రజిత క్షతగాత్రులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

## వొకేషనల్ ఉపాధ్యాయుడి హఠాన్మరణం


నవీన్(ఫైల్)

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శివనగర్‌లో కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బందారపు నవీన్(33) మంగళవారం పాఠశాలలో గుండెపోటుకు గురయ్యాడు. తోటి ఉపాధ్యాయులు సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండల కేంద్రానికి చెందిన నవీన్ రెండు సంవత్సరాల క్రితం ఈ పాఠశాలలో కంప్యూటర్ టీచర్‌గా విధుల్లో చేరాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు జిల్లా ఆసుపత్రికి చేరుకొని నవీన్ మృతదేహాన్ని పరిశీలించారు.

## దొంగ బాబాకు దేహశుద్ధి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపూర్ గ్రామంలో మంగళవారం గ్రామస్థులు దొంగ బాబాను పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పజెప్పారు. మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో హన్మాన్ మాలధారణలో ఉన్న ఓవ్యక్తి జ్యోతిష్యం పేరుతో గ్రామంలోని పలువురి డబ్బులు వసూలు చేశాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు కొందరు దొంగబాబా పారిపోయినట్టు తెలుసుకుని వెంబడించారు. మల్లాపూర్‌లో దొంగబాబాను పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న పోలీసులు దొంగబాబాను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

## అనుమతి లేని నిర్మాణం కూల్చివేత

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ మున్సిపల్ విలీన గ్రామమైన కోనాయపల్లి గ్రామంలో అనుమతులు లేకుండా నిర్మించిన మూడో ఫ్లోర్‌ను మున్సిపల్ అధికారులు మంగళవారం కూల్చివేశారు. గ్రామానికి చెందిన ఓ మహిళ జీ ప్లస్-2 నిర్మాణానికి మున్సిపల్ అనుమతులు తీసుకుని జీ ప్లస్-3 నిర్మించారు. దీంతో అనమతులకు విరుద్ధంగా నిర్మించిన ఫ్లోర్‌ను తొలగించాలని గ్రామానికి చెందిన ఒకరు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు రెండు రోజుల క్రితం మూడో అంతస్తును తొలగించాలని కోర్టు నుంచి ఉత్తర్వులు రావడంతో కూల్చివేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

## వెంటాడిన విధి

పాము కాటుతో గొర్రెల కాపరి మృతి


కూరగాయలు అమ్ముతూ వృద్ధురాలి హఠాన్మరణం


మంథనిలో కూరగాయలు అమ్ముతూనే హఠాన్మరణం చెందిన శంకరమ్మ

కమాన్‌పూర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వారిద్దరినీ విధి వెంటాడింది. బతుకు పోరులో వారు పని ప్రదేశంలోనే మృత్యువాత పడటం అక్కడ ఉన్న వారిని కలిచి వేసింది. కమాన్‌పూర్ మండలంలోని రొంపికుంట గ్రామానికి చెందిన కొయ్యడ రాజయ్య(53) అనే గొర్రెల కాపరి సోమవారం రాత్రి పాముకాటుకు గురై మృతి చెందాడు. రామగుండం మండలం లక్ష్మీపురం శివారులో గొర్లను మేపడానికి మంద ఏర్పాటు చేసుకున్నాడు. మంద ఏర్పాటు చేసుకున్న ప్రదేశం పక్కన నేలపై గొర్లకాపరి నిద్రించగా పాముకాటు వేయడంతో రాజయ్య నిద్రలోనే ప్రాణాలు కోల్పోయాడు. రాజయ్య కుటుంబ సభ్యులు ఎన్‌టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మృతదేహానికి గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య స్వరూప, కుమారులు రమేష్, సంజీవ్‌లు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎన్‌టీపీసీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మంథనిలో వృద్ధురాలు..

మంథని: స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో కూరగాయలు అమ్ముతూ ఓ వృద్ధురాలు ఒక్కసారిగా కుప్పకూలి విగతజీవిగా మారిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని గంగారం గ్రామానికి చెందిన చీర్ల శంకరమ్మ(60) అనే వృద్ధురాలు మంథనిలో కూరగాయలు అమ్ముతూనే గుండెపోటుకు గురై మృతి చెందింది. నిత్యం బస్సులో సొంత గ్రామం నుంచి కూరగాయలు తీసుకొని వచ్చి మంథనిలో కూరగాయలు అమ్ముకుంటున్న శంకరమ్మ మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా కుప్పకూలి పోయింది. ఆమెతో ఉన్న మహిళ గమనించి పక్కవారి తెలియజేయడంతో వారు 108కు సమాచారం ఇచ్చారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అందరితో కలిసిమెలిసి ఉంటూ పనిచేసుకునే శంకరమ్మ హఠాన్మరణం చెందడం కలిచివేసింది.


ఘటన స్థలంలో మృతి చెందిన గొర్రెల కాపరి రాజయ్య

## ఫిజికల్ సైన్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


సాత్విక

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని తీగలగుట్టపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సాత్విక అనే విద్యార్థిని ఫిజికల్ సైన్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టులో ప్రథమ బహుమతి సాధించింది. రాష్ట్ర స్థాయి పోటీలకు సాత్విక ఎంపికవడంపై ప్రధానోపాధ్యాయిని కరుణ, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయిని మంగ అభినందించారు. పలువురు విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచినట్లు వారు తెలిపారు.

# మూగబోయిన మరమగ్గం


యంత్రంపై దారం చుడుతున్న మహిళ


మగ్గాన్ని శుభ్రం చేస్తున్న కార్మికుడు

- 18 నెలలుగా పనులు లేక పస్తులు
- 'ఇందిర స్వశక్తి' చీరలపై నేతన్న ఆశలు
- ఆపన్న'హస్తం' కోసం కార్మికుల నిరీక్షణ

గంగాధర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రాల తయారీలో మరో సిరిసిల్లగా పేరున్న గంగాధర మండలం గర్శకుర్తిలో ఇప్పుడు నైరాశ్యంనెలకొన్నది. ఏ నేతన్నను కదిపినా చేతినిండా పనిలేక.. కడుపునిండా తిండి దొరకక అవస్థలు పడుతన్నారు. ఓవైపు గత బీఆర్‌ఎస్ పాలన నాటి దాదాపు రెండు కోట్ల రూపాయల బకాయిల ఆర్థికభారం... మరోవైపు చేసేందుకు పనిలేక ఇబ్బందిపడుతున్నారు. గడపగడపకు మగ్గాల చప్పుడుతో రంగురంగు ల డిజైన్లతో చీరలకు వన్నె తెచ్చిన పద్మశాలీల మరమగ్గాలు మూగ బోతున్నాయి. తరతరాలుగా వచ్చిన కులవృత్తిని నమ్ముకున్న కుటుంబాలు పనిలేక పూట గడవక కష్టంగా మరింది .కుల వృత్తిలో పనిలేక అప్పుడప్పుడూ ఇతర పనులు చేస్తూ కార్మికులు అష్టకష్టాలు పడు తూ బతుకు బండిని నెట్టుకొస్తున్న మర మగ్గాల కుటుంబాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

### అప్పులు చేసి కుటుంబ పోషణ

గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలో 16 వందల మరమగ్గాలతో పాటు చేనేత మగ్గాలున్నాయి. వీటిపై ప్రత్యక్షంగా ఆధారపడి జీవించే కుటుంబాలు 800 వందలున్నాయి.

18 నెలలుగా చేసిన మగ్గాలు నిలిచిపోయాయి. దీంతో పనిలేక కార్మికులు అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఎప్పటికైనా ప్రభుత్వం కార్మికులను గుర్తించి పని కల్పిస్తుందన్న భరోసాతో కాలం వెల్లదీస్తున్నారు. గతంలో ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లను గర్శకుర్తికి ఇవ్వడంతో కార్మికులకు చేతి నిండా పని దొరికింది. గర్శకుర్తితో పాటు గట్టుబూత్కూర్, రంగరావుపల్లి, తాడిజెర్రి, ఉప్పర మల్యాల, గంగాధర గ్రామాల్లో బతుకమ్మ చీరలను తయారు చేసేవారు. ఈ ఆర్డర్లు నిలిచిపోవడంతో 18 నెలలుగా పనిలేక కార్మికులు చిన్నచితకా పనులు చేస్తూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు.

### స్కూల్ యూనిఫామ్‌ల ఆర్డర్‌తో ఊరట

కొత్త ప్రభుత్వంలో స్కూల్ యూనిఫామ్‌లకు సంబంధించిన ఆర్డర్లు అందించగా కార్మికులకు రెండు నెలల క్రితం కొంత పని దొరికింది. ప్రభుత్వం బతుకమ్మ చీరల తరహాలో ఇందిర మహిళ శక్తి చీరల ఆర్డర్లను అందిస్తామని హామీ ఇవ్వడంతో గర్శకుర్తి నేతన్న కార్మికులు మురిసి పోతున్నారు. చీరల తయారీతో చేతినిండా పని దొరుకుందని ఆశతో ఎదురు చూస్తున్నారు. మగ్గాల బూజుదులుపుతున్నారు.

### పెట్టుబడి లేక ఇబ్బందులు

వేములవాడలో ఏర్పాటు చేసిన నూలు డిపో నుంచి గర్శకుర్తికి ముడిసరుకును అందించాలని, దీనితో ఆర్థిక భారం తగ్గుతొందని కార్మికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇప్పటికే గర్శకుర్తికి జౌళిశాఖ నుంచి మూడు లక్షల మీటర్ల ఆర్వీఎం, పీసీ తయారికి ఉత్తర్వులు వచ్చాయి. పెట్టుబడులు లేక పనులు నిలిచి పోయాయి. వేములవాడ డిపో నుంచి సబ్సీడీపై ఇవ్వక పోవడంతో పని చేయడానికి ఎవ్వరూ ముందుకు రావడంలేదని కార్మికులు తెలిపారు. నూలుకు సబ్సీడీ ఇచ్చి సంవత్సరం పొడుగునా పనికల్పించాలని మగ్గాల కార్మికులు కోరుతున్నారు.

### భారంగా రూ. రెండు కోట్ల బకాయిలు

గత ప్రభుత్వంలో తయారు చేసిన బతుకమ్మ చీరల బిల్లులు గర్శకుర్తికి ఎనిమిది కోట్ల బిల్లులు నిలిచి పోయాయి. బిల్లులు చెల్లించాలని కొత్త ప్రభుత్వాన్ని కోరగా ఆరు కోట్లు విడుదల చేసింది. మరో రెండు కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నారు. దీంతో కొత్త పెట్టుబడులకు చేతిలో డబ్బులు లేని పరిస్థితి నెలకొంది.


ఆరబెడుతున్న కార్మికుడు


కండెలు చుడుతున్న మహిళ

### స్వశక్తి చీరల ఆర్డర్లతో కార్మికులకు ఉపాధి
**యగ్నేష్, కాంగ్రెస్ నాయకుడు**



ప్రభుత్వం మరగ్గాల కార్మికులకు చేతినిండా పని కల్పించేందుకు స్వశక్తి మహిళ చీరల ఆర్డర్ల ఆలోచన అభినందనీయం. గర్శకుర్తితో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో మగ్గాలకు పని కల్పించేందుకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెల్లి ఉపాధి కల్పించాలని కోరుతా.

### కార్మికులకు పని కల్పించాలి
**గడ్డం నారాయణ, అధ్యక్షుడు, మరమగ్గాల కార్మికుల సంఘం, గర్శకుర్తి**

వృత్తిని నమ్ముకున్న మరమగ్గాల కార్మికులకు ప్రభుత్వం పని కల్పించాలి. గతంలో బతుకమ్మ చీరల తయారీతో ఆరు నెలల పని చేసేవారం. మిగతా సమయంలో పని దొరికేది కాదు. ప్రస్తుతం ప్రభుత్వం ఇందిర స్వశక్తి చీరల ఆర్డర్లను ఇస్తామని హామీ ఇచ్చింది. దీనితో పాటు ఇతర గుడ్డల తయారీకి ఆర్డర్లు ఇస్తే కార్మికులకు చేతినిండా పని దొరుకు తుంది. ప్రభుత్వం మగ్గాల కార్మికులకు వయస్సుతో నిమిత్తం లేకుండా పింఛన్ అందించాలి.



## పశువుల పాకల నిర్మాణానికి రైతుల ఆసక్తి


గుండిలో నిర్మించిన పశువుల పాక



రామడుగు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులకు చేయూతను అందించేందుకు మహిళ భరోసా పథకం కింద పశువులు, మేకల పాకలు నిర్మించుకునేందుకు నిధులు మంజూరు చేస్తోంది. ఈ పథకం ప్రయోజనకరంగా ఉండడంతో మండలంలో 77 మంది పశువుల పాకల నిర్మాణం ప్రారంభించారు. 30 మంది రైతులు నిర్మాణాలు దాదాపు పూర్తి చేశారు. ఇందులో 13 మందికి రైతులకు బిల్లులు చెల్లించారు. మరో 14 మేకల పాకలు మంజూరయ్యాయి. వాటిలో ఏడు నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇద్దరికి బిల్లులు చెల్లించినట్లు ఏపీవో రాధా తెలిపారు. నాడెం కంపోస్ట్ షెడ్లు, అజోల్ల గడ్డి పెంపకం షెడ్ల నిర్మాణం కూడా రైతులు చేపడుతుండగా వారికి అదనంగా డబ్బులు చెల్లించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పశువుల పాక నిర్మాణానికి 89 వేలు, మేకల పాకకు 1.19 లక్షల రూపాయలు నిధులను అందజేస్తున్నారు. వీటిని తిరిగి చెల్లించే అవసరం లేదు. పశువులు, గొర్రెల, మేకల పాకల నిర్మాణంతో ఎండ వాన, చలి వన్య ప్రాణుల నుంచి పశువులను రక్షించుకోవచ్చని రైతులు చెబుతున్నారు. ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న చిన్న, సన్నకారు రైతులు తహసీల్దార్ నుంచి, పశువులు ఉన్నట్లు పశు వైద్యుల నుంచి ధ్రువీకరణ పత్రం పొందాలి. గ్రామ పంచాయతీ తీర్మానం చేస్తే ఈ పథకం కింద నిధులు పొందవచ్చు.

**ఉపయోకరంగా ఉంది: మడ్డి ఎల్లయ్య,రైతు, గుండి**



పశువుల పాక నిర్మించుకోవడానికి ప్రభుత్వం చేసిన పని చాలా బాగుంది. ఎండ, వాన చలి నుంచి పశువులను కాపాడుకోవడానికి చక్కని మార్గం చూపిస్తుంది. షెడ్డుతో పాటు పెంట కుప్ప, గడ్డి పెంచడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసుకుంటున్నా..

### కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన
# దేశానికే మార్గదర్శకం

- బీఆర్‌ఎస్, బీజేపీకి కులగణనపై మాట్లాడే అర్హత లేదు
- మంత్రి పొన్నం ప్రభాకర్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన దేశానికే మార్గదర్శకంగా నిలుస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన కరీంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ దేశంలో అన్నివర్గాలవారీగా ఎవరి లెక్క ఎంత అనేది తేలాలని భారత్ జోడోయాత్రలో రాహుల్‌గాంధీ ఎప్పుడో స్పష్టం చేశారన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ దొందూ.. దొందేనని, రాంగ్ డైరెక్షన్‌లో పోయేలా ఈ రెండు రాజకీయపార్టీలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ప్రణాళికా సంఘం ఆధ్వర్యంలో కుల గణన చేసినట్లు తెలిపారు.

కులగణన చేయాలనే నిర్ణయం నుంచి నివేదిక వరకు, నివేదిక నుంచి నిధుల వరకు ఎలా అమలు చేయాలనే దానిపై రూట్‌మ్యాప్ తయారు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందన్నారు. మేధావులు, అన్నికులాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కులగణనపై అనవసర అనుమానాలతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. బలహీన వర్గాలకు న్యాయం జరగడం ఆ రెండు పార్టీలకు ఇష్టంలేదా అని ప్రశ్నించారు. సూచనలు, సలహాలు ఇస్తే తీసుకుంటామన్నారు. బీసీల్లో ముస్లిం మైనార్టీలు ఉండటం అనేది ఇప్పుడు కొత్తది కాదని, గతంలో కూడా ఇదే విధానం ఉండేదన్నారు. అర్బన్ నక్సల్స్ పేరుతో ఒక సెక్షన్‌ను టార్గెట్ చేయవద్దన్నారు. ఎర్రచొక్కా వేసుకున్నవారంతా నక్సల్స్ అనడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రగతిశీల భావాలు కలిగిన తాను ఎమ్మెల్సీ నామినేషన్ సందర్భంగా ఎర్ర చొక్కా వేసుకున్నా నని, అంతమాత్రాన తాను నక్సలైట్‌ను అవుతానా? అని ప్రశ్నించారు.

కులగణనలో భాగంగా సర్వేకు వెళ్లిన అధికారులకు ఎలాంటి వివరాలు ఇవ్వని బీఆర్‌ఎస్ నాయకులు కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు ఇప్పుడైనా తమ కుటుంబ, ఆస్తులు, ఇతర వివరాలు అందజేయాలని కోరుతూ సర్వేఫాంలను పోస్ట్ ద్వారా ఆ ముగ్గురు నేతలకు పంపిస్తున్నానని తెలిపారు. బీఆర్‌ఎస్ ముగ్గురు నేతలు వారి వివరాలు అందజేసిన తరువాతనే కుల గణనపై మాట్లాడేందుకు అర్హులవుతారన్నారు. కులగణనను అడ్డుకుంటూ సుప్రీం కోర్టులో అఫిడవిట్‌ను సమర్పించిన కేంద్రంలోని బీజేపీకి, సర్వేలో పాల్గొనకుండా, వివరాలు అందజేయని బీఆర్‌ఎస్‌లకు కులగణనపై మాట్లాడేందుకు నైతిక అర్హత లేదన్నారు. బండి సంజయ్‌కు దమ్ముంటే దేశవ్యాప్తంగా కుల గణన సర్వే చేయించాలని మంత్రి సవాల్ విసిరారు. బండి సంజయ్‌ని బీజేపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యత నుంచి తొలగిస్తే బీసీ సమాజం బాధపడ్డదని తెలిపారు. ఎమ్మెల్సీ కవితకు లిక్కర్ నినాదం అయిపోవటంతో ఇప్పుడు బీసీ నినాదం ఎత్తుకుందని మంత్రి విమర్శించారు. అప్పుడప్పుడు జాగృతి గుర్తుకు వస్తుందని, ఏమీ లేకపోతే బతుకమ్మ నినాదం ఎత్తుకుంటుందని ఎద్దేవా చేశారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆకారపు భాస్కర్ రెడ్డి, కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ మల్లికార్జున రాజేందర్, ఎండీ ఆరిఫ్, నాయకులు మంద నగేష్‌ముదిరాజ్, ఆకుల నర్సయ్య పాల్గొన్నారు.

## ఎల్‌ఐసీ ఉద్యోగుల ధర్నా

భగత్‌నగర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): భారతీయ జీవిత బీమా సంస్థలో నియామకాలు, యూనియన్ గుర్తింపు కోసం సంస్థ డివిజనల్ కార్యాలయం ఎదుట మంగళవారం ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. డివిజనల్ మేనేజర్ నారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇన్సురెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి వామన్‌రావు మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఎల్‌ఐసీ వ్యాపారం మూడు రెట్లు పెరిగిందని దీంతో సిబ్బందిపై అదనపు భారం పడుతోందని అన్నారు. పాలసీదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు క్లాస్ త్రీ, క్లాస్ ఫోర్ కేడర్లలో నియామకాలు చేపట్టాలన్నారు. దేశంలో అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో యూనియన్లకు ఎన్నికలు నిర్వహించి గుర్తింపు ఇచ్చారని, ఎమెర్జెన్సీ టైంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా భావ ప్రకటన చేసినందుకు రద్దు చేసిన గుర్తింపును ఇప్పటి వరకు తిరిగి ఇవ్వలేదని అన్నారు. 90 శాతం సభ్యత్వం ఉన్న ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు వెంటనే గుర్తింపు ఇవ్వాలని, లేని పక్షంలో మరిన్ని పోరాటాలు చేయడానికి సిద్ధమన్నారు. కార్యక్రమంలో డివిజనల్ నాయకులు సూర్యకళ, బసవేశ్వర్, అనుపమ, శ్రీలత, డివో యూనిట్ నాయకులు మహేష్, ప్రభాకరచారి, బ్రాంచ్ వన్ నాయకులు డి.శ్రీనివాస్, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఎల్‌ఐసీ డివిజనల్ మేనేజర్ నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

## 33 నామినేషన్ల తిరస్కరణ

- పట్టభద్రుల స్థానంలో 32
- ఉపాధ్యాయ స్థానంలో ఒకటి
- 13 వరకు ఉపసంహరణ

కరీంనగర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాల నామినేషన్ల పరిశీలన ముగిసింది. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ చేపట్టారు. పట్టభద్రుల నియోజకవర్గంలో 100 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా 32 మంది నామినేషన్లను వివిధ కారణాలతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తిరస్కరించారు. సరైన ఫార్మాట్‌లో ఉన్న 68 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి 17 మంది నామినేషన్లు దాఖలు చేయగా ఒకరి నామినేషన్ తిరస్కరణకు గురైంది. మిగిలిన 16 మంది నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆమోదించారు.


వివరాలను వెల్లడిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమే లా సత్పతి మాట్లాడుతూ అభ్యర్థులు నామినేషన్లను సమర్పించిన సంద ర్భంలో ఏమైనా లోపాలుంటే గుర్తించి అభ్యర్థులకు షాట్ మెమోలు ఇచ్చి సరి చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. కొంత మంది ఈ అవకాశాన్ని వినియోగించుకొని తప్పులను సవరించుకున్నట్లు చెప్పారు. నిబంధనలను అనుసరించి నామినేషన్ల పరిశీలన ప్రక్రియను చేపట్టామ న్నారు. సరైన ఫార్మాట్‌లో సమర్పించని నామినేషన్లను తిరస్కరించినట్లు తెలిపారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియ అనంతరం అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను కోరామని, తిరస్కరణపై అభ్యంతరం వ్యక్తం చేసిన వారి సందేహాలను నివృత్తి చేశామని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్‌రామన్, అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్‌డీవోలు మహేశ్వర్, రమేశ్, ఏవో నరేందర్, తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

# చల్లగా చూడమ్మ.. బద్దిపోచమ్మ తల్లీ..

- అమ్మవారికి భక్తుల బోనం మొక్కులు
- నెత్తిన బోనాలతో క్యూలైన్‌లో బారులు


బద్దిపోచమ్మ దర్శనం కోసం నెత్తిన బోనంతో క్యూలైన్‌లో భక్తులు



వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పిల్లా పాపలను, పాడి పంటలను చల్లగా చూడమ్మా.. బద్ది పోచమ్మ తల్లీ.. అంటూ భక్తులు అమ్మవారికి బోనం మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి ఇష్టమైన మంగళవారం భక్తులు మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పు చప్పుళ్ల, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో క్యూలైన్‌లు కిక్కిరిసిపోయాయి. నెత్తిన బోనాలతో గంటల తరబడి క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి పట్నాలు వేశారు. నైవేద్యాన్ని సమర్పించి నూతన వస్త్రాలను ధరించి ఒడిబియ్యం సమర్పించుకున్నారు. అమ్మవారికి ఇష్టమైన కల్లు సాక పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

### పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
**మున్సిపల్ కమిషనర్ అన్వేష్**

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రంలో ఈనెల 25 నుంచి 27వ తేది వరకు నిర్వహించే మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు పారిశుధ్యంతో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్ అన్వేష్ సిబ్బందికి సూచించారు. మహాశివరాత్రి జాతర సమీపిస్తుండటంతో ఆలయ ఏఈవో అశోక్, శానిటేషన్ సూపరింటెండెంట్ వరి నర్సయ్యలతో కలిసి ఆలయ పరిసరాల్లోని డ్రైనేజీలను కమిషనర్ మంగళవారం పరిశీలించారు. మహాశివరాత్రి జాతర సమీపిస్తుండటంతో ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచా లని, ఆలయ ఉద్యో గులు, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో ముందుకు వెళ్లి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ఆయన వెంట రాజన్న ఆలయ డీఈ మహిపాల్‌రెడ్డి, ఏఈ రామకృష్ణ, సూపరింటెండెంట్ శ్రీకాంతచారి తదితరులు ఉన్నారు.

## భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు


ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ

మల్యాల, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో కొండంతా రద్దీగా మారింది. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. సుమారు ఇరవై వేలకు పైగా స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ పర్య వేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, పార్కింగ్ ప్రదేశం నిండిపోయాయి. కాగా ఆలయ పరిసరాలు బురదమయంగా ఉండడంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

### అంజన్న గర్భాలయానికి
## వెండి తొడుగులు


వెండి తొడుగుల అనంతరం మెరిసిపోతున్న గర్భాలయం

మల్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి గర్భాలయాలని వెండి తొడుగుల అమర్చారు. రెండేళ్ల కిత్రం వెండి తొడుగులతోపాటు మరిన్ని వస్తువులు చోరీకి గురయ్యాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడు సోమవారం బంగారు, వెండి ఆభరణాలు, తొడుగులు అందజేశారు. సంప్రోక్షణ పూజల అనంతరం బంగారు పూత గల రామరక్ష, కిరీటం స్వామి వారి మూల విరాట్టుకు అమర్చారు. మంగళవారం గర్భాలయానికి 48.5 కిలోలతో తయారు చేసిన వెండి తొడుగులు అమర్చారు. తొడుగులకు ఉన్న శంఖు చక్రాలు, హనుమాన్ ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి.


వెండి తొడుగులు చోరీకి గురికావడంతో బోసి పోతున్న గర్భాలయం (ఫైల్)

## పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

**ఆరెపల్లి రాజయ్య, ఎంఈవో**



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

**ఆంధ్రజ్యోతి:** పదో తరగతి విద్యార్థుల పట్ల ఎలాంటి శ్రద్ధ చూపుతున్నారు

**ఎంఈవో:** పరీక్షలు సమీస్తున్న దృష్ట్యా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఉదయం, సాయంత్రం అదనపు సమయాన్ని కేటాయిస్తూ బోధిస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి:** ఎంత మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు?

**ఎంఈవో:** మండలంలో 11 ప్రభుత్వ, 8 ప్రైవేట్ హైస్కూల్స్ ఉన్నాయి. వీటిలో 529 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. భూపతిపూర్ కస్తూర్బాలో 40 మంది, మోడల్ స్కూల్‌లో 83, మహాత్మాజ్యోతి బాపూలేలో 72, బాలికల, బాలుర సాంఘిక సంక్షేమ శాఖ గురుకులంలో 147 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

**ఆంధ్రజ్యోతి:** ప్రైవేట్ పాఠశాలలు హాల్ టికెట్ ఇవ్వకుంటే చర్యలు?

**ఎంఈవో:** హాల్ టికెట్ ఇవ్వకుంటే తమ దృష్టికి తీసుకురావాలి. ఫీజుల విషయాన్ని విద్యార్థులను అడగవద్దు. హాల్ టిక్కెట్ ఇవ్వకుండా ఇబ్బంది పెడితే తమను సంప్రదించాలి.

- సుల్తానాబాద్

## పోలీసులకు సవాల్‌గా యశ్వంత్ హత్యాయత్నం

కోల్‌సిటీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని రాంనగర్‌లో ఆర్ఎఫ్‌సీఎల్ అవుట్ సోర్సింగ్ కార్మికుడు పరాంకుశం యశ్వంత్(36)పై జరిగిన హత్యాయత్నం పోలీసులకు సవాల్‌గా మారింది. గత నెల 7న ఘటన జరుగగా ఇప్పటికీ విచారణలో ఎలాంటి పురోగతి సాధించలేదు. బాధితుడు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతను కూడా ఏం జరిగిందో చెప్పే పరిస్థితిలో లేనట్లు తెలుస్తుంది. యశ్వంత్‌పై దాడి చేసిన నిందితులు తల, ముఖాన్నే లక్ష్యంగా చేసుకుని దాడి చేశారు. దాడి సమయంలో నిందితులకు, బాధితుడికి మధ్య పెనుగులాట జరిగినట్టు భావిస్తున్నారు. యశ్వంత్ మెడలో బంగారు గొలుసు మాయమైనట్టు తెలుస్తుంది. దాడి చేయాలనే వచ్చిన నిందితులు ఇంట్లో చోరీకి యత్నించలేదు. కుటుంబ సభ్యుల సమక్ష్యంలో బీరువాను తెరువగా నగదు, ఆభరణాలు అలాగే ఉన్నాయి. ఒంటరిగా ఉన్న యశ్వంత్‌పై ఇంటి వెనుక నుంచి వచ్చి దాడి చేసిన దుండగులు ఆధారాలు లేకుండా జాగ్రత్తలు పడ్డారు. వేలి ముద్రలు పడకుండా జాగ్రత్త పడ్డారు. బాధితుడి భార్య ప్రతిమ, కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు.

## హామీలు అమలు చేయాలని చలో హైదరాబాద్

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుకే సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో చలో హైద్రాబాద్ కార్యక్రమం చేపట్టినట్టు మంథని డివిజన్ కార్యదర్శి బీ అశోక్ పేర్కొన్నారు. చలో హైద్రాబాద్ కరపత్రాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించారు. గత పాలకుల మాదిరిగానే కాంగ్రెస్ పాలన కొనసాగు తున్నదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు, హామీలను ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్నా హామీల అమలు సక్రమంగా జరగలేదని అశోక్ తెలిపారు. రేవంత్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయించేలా అన్ని వర్గాల ప్రజల మద్దతు కూడగట్టి ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. హామీలను అమలు చేయాలని డిమాం డ్‌తో ఈనెల 20న హైద్రాబాద్‌లో ప్రజా ప్రదర్శన, బహిరంగ సభకు ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. రాము, దేశాయి నాయక్, పద్మ, వెంకటేష్, రవి, లక్ష్మి పాల్గొన్నారు.

## టీబీపై అవగాహన సదస్సు

ముత్తారం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మం డలంలోని మచ్చుపేట సబ్ సెంటర్ పరిధిలోని మచ్చుపేట, లక్కరం గ్రామాలలో ప్రజలకు టీబీ వ్యాధి నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు. వ్యాధి సోకడం, నివారణకు తీసుకో వలసిన జాగ్రత్తలపై వివరించారు. నర్స్ గ్రేసీ మనీ, బొల్లం దీప్తి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్ఎం పుష్పలత, వరలక్ష్మి, లత, కల్పన పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

మంథనిరూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నాగారం వద్ద అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. టీఎస్ 02 యూబీ 9648 ఆటో ట్రాలీలో 10 సంచుల్లో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం తరలిస్తున్న డ్రైవర్ తూర్పాటి రవి విచారించగా బియ్యాన్ని మహారాష్ట్రంలోని సిర్వోంచకు తరలిస్తున్నట్లు సమాచారం ఇచ్చారన్నారు. దీంతో వారి పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఆర్థికసాయం

ధర్మారం ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఖానంపల్లి గ్రామానికి చెందిన కల్వల రజిత సతీష్ దంపతులు ఇటీవల మృతి చెందగా వారి పిల్లలు హర్షవర్ధన్, తనుషాలు అనాథలయ్యారు. కెనడాలోని కొలుముల దామోదర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా ఆర్థిక సహాయం అందించాలని ఫౌండేషన్ ఇంచార్జ్ వేల్పుల నాగరాజును ఆదేశించారు. మంగళవారం రూ.10 వేల ఆర్థికసహాయాన్ని అందించారు.

# అధ్వానంగా పారిశుధ్యం

- దోమల నివారణకు చర్యలు లేవు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

ఆంధ్రజ్యోతి విజిట్



నాంసానిపల్లి గ్రామంలో మరమ్మతుకు నోచుకోని బోర్‌వెల్

5వ పేజీ తరువాయి

**పాలకుర్తి:** సర్పంచ్‌లు లేకపోవడంతో గ్రామాల్లో పలు సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. ప్రత్యేకాధికారులు స్థానికంగా ఉండకపోవడం, సుదూర ప్రాంతాల నుంచి వస్తుండడంతో సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోయాయి. పల్లె సమస్యలపై పట్టు లేకపోవడంతోపాటు పారిశుధ్యంపై ప్రత్యేకాధికారుల క్షేత్ర స్థాయి పర్యవేక్షణ కరువు అయ్యిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పారిశుధ్య కార్మికుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు రాలేదని వాపోతున్నారు. సెంట్రల్ విద్యుత్ దీపాలు పని చేయడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందడం లేదని ప్రజలు తెలిపారు. దీంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది వ్యాధులకు కారకాలుగా నిలుస్తున్నాయి. ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుధ్యంపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ధర్మారం:** మండల వ్యాప్తంగా పారిశుధ్యం పడకేసింది. సెక్రెటరీలు గ్రామాలను శుభ్రంగా ఉంచడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎర్రగుంటపల్లి, ధర్మారం, జక్కన్నపల్లి గ్రామాలను విజిట్ చేయగా ఎర్రగుంటపల్లి ఎస్సీ కాలనీలో డ్రైనేజీలు ఎక్కడికక్కడ కూలిపోయాయి. మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు నీరు మేన్‌రోడ్డు పక్కనే పారుతోంది. బీసీ కాలనీలో బోర్‌వెల్ చుట్టు నీరు నిలిచి అపరిశుభ్ర వాతవరణం నెలకొంది. దోమల బెడద ఎక్కువగా ఉంది. మురికి కాలువల్లో కనీసం బ్లీచింగ్ చల్లడం లేదని ప్రజలు వాపోతున్నారు. తహసీల్దార్, పోలీస్‌స్టేషన్ ఎదురుగా డ్రైనేజీ లేకపోవడంతో తాత్కాలింగా ఏర్పాటు చేసిన కాలువ నుంచి మురుగు నీరు ప్రవహిస్తుంది. కార్యాలయాల ఎదుట కూడా డ్రైనేజీల నిర్మాణం చేపట్టకపోవడం పాలకుల నిర్లక్ష్యంగా ప్రజలు చెప్పుకుంటున్నారు.

**పెద్దపల్లిరూరల్:** ప్రత్యేకాధికారుల పాలనతో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు కనిపించడం లేదు. దీంతో ఏడాది కాలంగా గ్రామాలు పూర్తిగా చెత్తచెదారంతో పాటు ప్రజలు రోగాల బారిన పడుతున్న పరిస్థితులు ఉన్నాయి. వీటితో పాటు నిధులు లేకపోగా అధికారులు సైతం గ్రామాలపై ఆసక్తి చూపడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వేసవికాలం సమీపిస్తున్న దృష్ట్యా దోమల నివారణకు ఫాగింగ్ చేయని పరిస్థితి ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. వీటితో గ్రామ పంచాయతీ కార్యాలయాలకు వెళ్లి సమస్యలు చెబుతామంటే అధికారులు సమయానికి ఉండడం లేదని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

**కమాన్‌పూర్:** మండల కేంద్రంలోని డ్రైనేజీలో చెత్తాచెదారం పేరుకుపోయి మురికి నీరు రోడ్డుపై పారుతుంది. ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామంలో డ్రైనేజీలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. పారిశుధ్య పనులపై పట్టింపు కరువైంది. డ్రైనేజీలు శుభ్రం చేయించడంతోపాటు పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

**ఓదెల:** నాంసానిపల్లి, మడక గ్రామాలను ఆంధ్రజ్యోతి సందర్శించింది. నాంసానిపల్లిలోని మురికి కాలువల్లో చెత్త, మట్టి పేరుకుపోయి పిచ్చి మొక్కలు మొలిచాయి. దీంతో నీరు నిల్వ ఉండి దోమలు ఉధృతి చెందుతున్నాయి. దోమల నివారణ మందులు పిచికారి చేయాలని గ్రామస్థులు పేర్కొంటున్నారు. పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బోర్‌వెల్ చెడిపోయి ఏడాది గడుస్తున్నా మరమ్మతుకు నోచుకోలేదు. మడక గ్రామంలో మానేరు వాగు నుంచి ఇసుక తవ్వకాలతో గ్రామంలోని బావులు, వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. గ్రామంలో ఇప్పటికే తాగునీటి కొరత ప్రారంభమైంది. నీటి కొరతను అధిగమించేందుకు వ్యవసాయ బావులను అద్దెకు తీసుకోవడానికి రైతులను సంప్రది స్తున్నారు. మిషన్ భగీరథ నీరు అందడం లేదు. ఇళ్లల్లో చెత్తను ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డులకు తరలిస్తున్నా డ్రైనేజీ పూడిక తొలగించడం లేదు.



ఎర్రగుంటపల్లిలోని ఎస్సీ కాలనీలో కూలిపోయిన మురికి కాలువ, వడుకాపూర్‌లోని మురికికాలువ

**జూలపల్లి:** ప్రత్యేకాధికారులు గ్రామాలకు అడపాదడపా వస్తుండడంతో గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కార్యదర్శులు పారిశుధ్య పనులు చేయించకపోవడంతో డ్రైనేజీలు పేరుకుపోయి కంపుకొడుతున్నాయి. దోమల ఉధృతితో వ్యాధుల బారినపడే పరిస్థితులు నెలకొన్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో నిధులు ఉన్నప్పటికి అభివృద్ధి పనులు చేయడానికి కార్యదర్శులు ముందుకు రావడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో నిధుల కొరతతో కార్యదర్శులు ఖర్చు చేసి బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. బిల్లులు రాక అప్పుల పాలయ్యామని పేర్కొంటున్నారు.

### పట్టించుకునే వారే కరువయ్యారు

**ముంజ రాజుగౌడ్ కన్నాల**



గ్రామ పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. పట్టించుకునే వారే కరువయ్యారు. సర్పంచ్ ఉంటే ఏ సమస్య వచ్చినా పరిష్కరించుకునే వారం. ప్రత్యేకాధికారులు అడపదడపా పను లు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. అపరిశుభ్రతతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి.

### సమస్యలను పట్టించుకోవడం లేదు

**జెల్ల మల్లయ్య, ఎర్రగుంటపల్లి**



మా సమస్యలు ఎవరూ పట్టించుకోవడం లేదు. నల్లానీరు రావడం లేదు. తాగు నీటి కోసం అడిగినా ఎవరూ పట్టించుకోవడం లేదు. వర్షాకాలం వస్తే మా ఇండ్ల చుట్టు నీళ్లు చేరుతాయి. దోమలు ఎక్కువగా ఉండి ఎప్పుడూ జరాలు వస్తాయి. పాలకులు ఎవరైనా మాకు నీళ్లు ఇయ్యాలే.

### దోమల స్వైర విహారం

**- బాలసాని లెనిన్, కొత్తపల్లి**



గ్రామంలో దోమలు స్వైర విహారం చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదు. పలుమార్లు కార్యదర్శికి ఫాగింగ్ చేయా లని కోరినా చేయించలేదు. దీంతో మురికి కాలువలు చెత్త చెదారంతో పేరుకుపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. వేసవికాలంలో దోమలు మరింత పెరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలి.

### పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదు

**పిల్లి భూమయ్య, తెలుకంట.**



పంచాయతి పాలకవర్గాలు లేకపోవడంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడంలేదు. ప్రత్యేకాధికారులు అధికార కార్యక్రమాలకు తప్ప ఇతర రోజుల్లో రావడంలేదు. కార్యదర్శులు పనులు చేస్తామంటే పంచాయతీల్లో పైసలు లేవు. పారిశుధ్య లోపంతో దోమలు విపరీతంగా వస్తున్నాయి. ఎన్నికలు నిర్వహిస్తే సర్పంచ్‌లను అడగడానికి అవకాశం ఉంటుంది.

# బాడీబిల్డర్‌కు ఘన సన్మానం




ముజమ్మిల్‌ను సన్మానిస్తున్న సంధ్యారాణి తదితరులు

జ్యోతినగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల హైదరాబాద్ ఎల్‌బి స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్‌లో ప్రతిభ కనబర్చిన స్థానిక బాడీ బిల్డర్ ముజమ్మిల్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఎన్టీపీసీ కృష్ణానగర్‌లోని ట్రూఫిట్ జిమ్‌లో జరిగిన కార్యక్రమానికి రామగుండం బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈనెల 10న హైదరాబాద్‌లో షఫి సమి క్లాసిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలో ట్రూఫిట్ జిమ్ నిర్వాహకుడు ముజమ్మిల్ ఐదవ స్థానం సాధించాడు. ఈసందర్భంగా ముజమ్మిల్‌ను శాలువా కప్పి సత్కరించారు. కందుల సంధ్యారాణి మాట్లాడుతూ బాడీ బిల్డింగ్‌లో ముజమ్మిల్ మరింత రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో షకీల్, సుధాకర్, దాసరి రాయలింగు, కిరణ్, శ్రీనివాస్, ప్రణయ్‌గౌడ్, సమీర, ప్రవళ్లిక, స్మిత, ప్రణయ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కాల్వశ్రీరాంపూర్ హరిహర క్షేత్రంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. వేదపండితులు మల్లవజ్జుల ప్రవీణ్‌శర్మ, వల్లూరి సతీష్‌శర్మ మంత్రోచ్చారణల మధ్య కల్యాణం జరిపించారు. రిటైర్డ్ తహసీల్దార్ కె.భగవంతురావు దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. హైకోర్టు న్యాయవాది అశోక్‌రావు, జానకిరామ్ భాస్కర్‌రావు, ఇమ్మడి శ్రీనివాస్ దంపతులు వధూవరుల పక్షాన పాల్గొన్నారు. స్వామివారికి భక్తులు ఓడిబియ్యం, చీర, సారే సమర్పించారు. రాజేశ్వర్‌రావు, రామచంద్రారెడ్డి, రఘుపతిరావు, పులి కిషన్‌రెడ్డి, నార్ల రాజన్న, పాల్గొన్నారు.

# దేశం కోసం సేవ చేసిన మహనీయుడు దీన్‌దయాల్

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): దేశం కోసం నిస్వార్థంగా సేవ చేసిన మహనీయుడు, మానవతావాది పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ అని బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య అన్నారు. మంగళవారం పండిట్ దీన్‌దయాల్ ఉపా ధ్యాయ వర్థంతి సందర్భంగా శివాజీనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ దీన్ దయాల్ సిద్ధాంతం ఆధారంగానే మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభు త్వ వికాసిత్ భారత్ లక్ష్యంగా అడుగులు వేస్తుందన్నారు. దీన్ దయాల్ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ నడవా లని పిలుపునిచ్చారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుల్వ లక్ష్మీ నర్సయ్య, పెద్దపల్లి రవీందర్, మహవాది రామన్న, సోమా రపు అరుణ్, నవీన్, దాసరి శ్రీనివాస్, శివ, సతీష్, రాజు, అశోక్, స్వామి, శ్రావణ్ పాల్గొన్నారు.

**అంతర్గాం:** ఎల్లంపల్లిలో మంగళవారం దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు బొడకుంట సుభాష్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు జన సంఘ్ అధ్యక్షుడిగా పనిచేసిన దీన్ దయాల్ ఉపాధ్యాయ గొప్ప మానవతావాది అని కొని యాడారు. నాయకులు మాడ ప్రభాకర్ రెడ్డి, అనిల్ రెడ్డి, ఆలకుంట మల్లేష్, బాలసాని సత్యంగౌడ్ పాల్గొన్నారు.

**జూలపల్లి, (ఆంధ్రజ్యోతి):** మండలకేంద్రంలోని బస్టాం డ్ చౌరస్తాలో బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహే ష్ ఆధ్వర్యంలో దీన్‌దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దీన్‌దయాల్ ఉపాధ్యాయ అట్టడుగు వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా జనసంఘ్‌ను స్థాపించాడన్నారు. జేకే శేకర్‌యాదవ్, కంక నాల జ్యోతిబసు, మెండె రాజన్న, ఐలన్న, మెరుగు కనుకయ్య, పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక



రౌతు రితీష

ముత్తారం, ఫిబ్రవరి (ఆం ధ్రజ్యోతి)11: దరియాపూర్ శివారులోని ఆదర్శ పాఠశాల నుంచి రౌతు రితీష అనే విద్యార్థిని ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కేసరి సంతోష్ కుమార్‌తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్ యేటా రూ.12 వేల ఉపకార వేతనం అందజే స్తారని తెలిపారు. గతేడాది నవంబర్ 24 న జరిగిన పరీక్షలో 8వ తరగతి విద్యార్థిని రితీష ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థి విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. అధ్యాపక, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయకపోతే చర్యలు

**కాంట్రాక్టర్ల సమావేశంలో కమిషనర్ అరుణశ్రీ**

కోల్‌సిటీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో ఒప్పందం ప్రకారం నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని రామగుండం నగర కమిషనర్ అరుణశ్రీ పేర్కొన్నారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిల్లులు రికార్డు చేయడంలో ఎవరైనా అధికారులు జాప్యం ప్రదర్శించినా, లంచాలు అడిగినా ఏసీబీ అధికారులకు గానీ, తనకు గానీ, కలెక్టర్‌కు గానీ ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ఏసీబీ అధికారుల ఫోన్ నెంబర్లతో బోర్డు ఏర్పా టు చేస్తామని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లు నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయకపోతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని, కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెడతామన్నారు. గతంలో కౌన్సిల్ తిరస్కరించి పనుల బిల్లులపై కలెక్టర్‌కు నివేదిస్తానని ఆమె పేర్కొ న్నారు. మిగతా అభివృద్ధి పనులకు సంబంధించి ఎన్ని కల కోడ్ తరువాత మొదలు పెట్టాలన్నారు. ఎస్ఈ శివానంద్, ఈఈ రామన్, కాంట్రాక్టర్లు పాలొన్నారు.

## పదేళ్లలో బీఆర్ఎస్ చేసిందేమి లేదు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రామగుండంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చేస్తున్న అభివృద్ధి పనులను చూడలేక బీఆర్ఎస్ నాయకులు చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ మహిళా నాయకురాలు సన ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే మక్కాన్‌సింగ్ రామగుండానికి అనేక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నారని, ప్రతి డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు మౌలిక వసతులను కల్పిస్తున్నారన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేయలేని పనులు మక్కాన్‌సింగ్ చేసి చూపెడుతున్నారని, లక్ష్మీనగర్ వ్యాపార కూడలిని అభివృద్ధి చేసి వ్యాపారాలను పెంపొందించడానికి కృషి చేస్తున్నాడని, 14సంవత్సరాల క్రితమే లక్ష్మీనగర్‌లో రోడ్లు వెడల్పు చేయాలని కౌన్సిల్‌లో తీర్మానం చేశారని, కొత్తగా ఇప్పుడు చేయలేదని, దీనిపై బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలని ఆమె హితవు పలికారు. విలేకరుల సమావేశంలో సరోజన, భార్గవి, దీప, ప్రశాంతి, జరీనాబేగం, షహీరబేగం, సమ్మక్క, తాజ్ పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్ల జాబితా విడుదల

సుల్తానాబాద్ , ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు పోలింగ్ స్టేషన్ల జాబితాను విడుదల చేసినట్లు ఎంపీడీఓ దివ్యదర్శన్ రావు తెలిపారు. సుల్తానాబాద్ మండలంలో 13 ఎంపీటీసీ, ఒక జడ్పీటీసీ స్థానాలకుగాను 74 పోలింగ్‌స్టేషన్లు గుర్తించామన్నారు. పోలింగ్ స్టేషన్ల పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 13లోగా రాతపూర్వకంగా సమర్పించాలన్నారు. 13న రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి, ఈ నెల 15న కలెక్టర్‌కు పంపిస్తామని వివరించారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో టిఫిన్లు పంపిణీ

మంథని, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మంథని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ పుట్టిన రోజు సందర్భంగా మాజీ ఉప సర్పంచ్ పుప్పాల భాగ్యలక్ష్మితిరుపతిల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఆదివారం టిఫిన్లు పంపిణీ చేశారు. నివాసంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుతో కలిసి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, మహిళా నాయకురాళ్ళ మధ్య శైలజ కేక్ కట్ చేశారు. పార్టీ నేతలు తగరం శంకర్‌లాల్, ఏగోళపు శంకర్‌గౌడ్, కాయితీ సమ్మయ్య, రాణీలు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ కరాటే టోర్నీలో బంగారు పతకం



విజేతగా నిలిచిన శరణ్య

ఓదెల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన విద్యార్థి లగిశెట్టి శరణ్యకు అంతర్జాతీయ కరాటే టోర్నీలో రెండు పతకాలు లభించాయి. విశాఖపట్నంలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఓపెన్ టు ఆల్ కరాటే టోర్నీలో ఓదెలకు చెందిన లగిశెట్టి శరణ్య అండర్ 14 విభాగంలో 35 కిలోల స్పారింగ్‌లో ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. 40 కిలోల విభాగం కటాస్‌లో ద్వితీయ స్థానంలో లభించినట్లు మాస్టర్ రమేష్ తెలిపారు. గ్రాండ్ మాస్టర్ మొండయ్య, డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ సంపత్ కుమార్ విజేతను అభినందించారు.

## వాలీబాల్ టోర్నీ విజేత లంబాడితండ

ఓదెల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. లంబాడతండ, కరీంనగర్ జిల్లా వీణవంక క్రీడా జట్ల మధ్య జరిగిన చివరి పోరులో లంబాడితండాకు చెందిన జట్టు విజేతలుగా నిలిచింది. విజేతలకు నగదుతోపాటు టోర్నీ కప్‌ను సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి భీష్మచారి అందజేశారు. బోడకుంట రామచంద్రం, టోర్నీ నిర్వాహకుడు బేకరీ మధు, ఆర్ఎంపి చెరుకు తిరుపతి, గోపతి మల్లయ్య, హనుమాన్ యూత్ సభ్యులు పిట్టల మహేందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.




## సివిల్స్ అభ్యర్థులకు మాక్ ఇంటర్వ్యూలు




అభ్యర్థికి ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న సింగరేణి సీఎండీ, ఉన్నతాధికారులు

గోదావరిఖని, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ మౌఖిక పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులకు మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో మాక్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. సింగరేణి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద సివిల్స్ ప్రిలిమినరీ పాసైన వారికి లక్ష రూపాయల ప్రోత్సాహం, మెయిన్స్‌లోనూ విజయం సాధించిన వారికి మరో లక్ష రూపాయల ప్రోత్సాహాన్ని అందించిన విషయం తెలిసిందే. ఇంటర్వ్యూలకు ఎంపికైన వారికి మాక్ ఇంటర్వ్యూలను నిర్వహించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, తెలంగాణ ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్యానెల్‌లో మాక్ ఇంటర్వ్యూలు జరిగాయి. ఇంటర్వ్యూను ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై పలు కీలక సూచనలు చేశారు.

## నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి



ఆర్జీ-2 జీఎంకు వినతిపత్రం ఇస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కార్మిక వాడలకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ఆర్జీ-2 యాజమాన్యం చర్యలు తీసుకోవాలని టీబీజీకేఎస్ నాయకులు జీఎం వెంకటయ్యను కోరారు. నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చేడాలని, మౌలిక వసతులపై మంగళవారం టీబీజీకేఎస్ బృందం జీఎంను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కొన్ని రోజులుగా యైటింక్లయిన్ కాలనీకి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడి కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. రోజు నీటి సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని జీఎంను కోరారు. కాలనీ గోదావరిఖని కోల్‌కారిడార్ రోడ్డు, అంతర్గత రోడ్లు దెబ్బతిన్నందున మరమ్మతు చేయించాలన్నారు. గ్రౌండ్‌లో లైటింగ్, నీటి సదుపాయం ఏర్పాటు చేయాలని, పోతనకాలనీ కమ్యూనిటీహాల్‌లో ఆరు గెస్ట్ రూంలు నిర్మించాలని కోరారు. కాలనీ, పోతనకాలనీలో ఆర్వో ప్లాంట్ మెయింటనెన్స్ సక్రమంగా లేక శుద్ధజల సరఫరా కావడం లేదని, ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతు చేయించాలని కోరారు. ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్, నాయకులు బేతి చంద్రయ్య, అబ్బు శ్రీనివాస్ రెడ్డి, కూర తిరుపతి, అనిల్‌రెడ్డి, దాసరి శ్రీనివాస్, రవితేజ, వెంకటేష్, శ్రీకాంత్, కమలాకర్, రాకేష్ ఉన్నారు.